నవ
రసాల

# కుళ్ళూ పేతుళ్ళూ

## శ్రీశ్రీ

భీభత్స రసం

దేవుడి గదిలో దయ్యాలు - ఇది
ప్రతీ యింటిలో బీభత్సం
ఇంట్లో వంటకి మండదు పొయ్యి
దేవర వారికి దీపాలు
కక్కసు చూస్తే ప్రత్యక్ష నరకం
గలీజు బూజూ గదులన్నీ
తలగడాలలో నల్లుల సంతతి
తండులాలలో మన్నూ మశానం
ధనిక గృహాల్లో దారిద్ర్యం
ఇదే బ్రదర్ మన ఐశ్వర్యం

మనం మనుష్యుల మనుకొందామా,
ద్విపాద పశువులమని అంటామా?
పశువుకి కూడా శుభ్రత వుంది
నర పశువులకే అది లేదు.
ఈ దేశంలో ఎలుకా దేవుడు
పందీ దేవుడు మనిషే యెదవ!
వ్యాపారంరా, వ్యాపారం!
తెల్లారి లేచింది మొదలు
యెవడి నెత్తి కొడదామా అనే ఆలోచన,
మొగుణ్ణి పెళ్ళాం మోసం చేస్తది
మొగాడు ముండల మరాకోరు
ఎక్కడా లేని ఇంత అసహ్యం
ఇక్కడే ఎందుకుండాలి?
అందుకు ఒకటే కారణం
అదే దైవం
అనే భావం
చెయ్‌రా, చెయ్‌రా, చెయ్, చెయ్, చెయ్,
నీ యిష్టం వచ్చినన్ని పాపాలు చెయ్
ఫర్వాలేదు భగవంతుడున్నాడు
కొబ్బరి కాయొకటి కొడితే చాలు
కర్పూరం వెలిగిస్తే మేలు

ముడుచుకు పోతాయ్, నీ పాపాలు
మసీదు ముందర, చాపెల్ ముందర
కోవెల ముందర గుమిగూడేది
ఎవరు వారు? ఎవరు వారు?
కుష్టు రోగులూ, కుంటీ గుడ్డీ
ఆ చుట్టూతా బోలెడు ఈగలు
బోలెడు దోమలు
నీ అన్నంలో విషం కలుపుతాయ్
సరదాగా నువ్వది సాపడుతావు
అదే ప్రసాదమని అనుకుంటావు
కళ్ళ కద్దు కుంటావు
అది పెంటరా అని నే నంటా
నువ్వు నన్ను నాస్తికు డంటావు
ఒరేయ్ ఎలుకా, ఒరేయ్ పంది
ఒరేయ్ శునకా, ఒరేయ్ నందీ
మీ రంతా భక్తులు, అశక్తులు,
బానిసలు !
మానసిక స్వాతంత్ర్యం లేదు మీకు, మీ
మనస్సు నిండా
కుళ్ళూ, పీతుళ్ళూ
ఇది జుగుప్స!
ఇది బీభత్సానికి స్థాయీ భావం!
ఈ యేహ్యం ఎవరు తొలగిస్తార్రా?
దేవుడా?
బతికున్న జీవుడా?
వెళ్ళు గుడిలోకి
        దరగా లోకి
        చర్చి లోకి
అక్కడ అంతా బీభత్సం!
        బైటికి రా!
విశాల విశ్వంలోకి విరుచుకు పడు!
నన్ను నమ్ము! నా మాట నమ్ము!
కుళ్లు దేవుళ్ళని నమ్మకు
దేవుళ్ళంతా కుళ్ళే!

---

ముద్రణ : జ్యోతి మాసపత్రిక జనవరి 1977